క్లుప్తంగా

చండీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


చండీదేవి రూపంలో అమ్మవారు

కెరమెరి: మండల కేంద్రంలో తుజాల్పు రం కాంప్లెక్స్లోని దుర్గాదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారు త్రిపుర చండీదేవిగా దర్శనమిచ్చారు. మండలంతో పాటు ఇతర గ్రామాల్లో ఉదయం, సాయంత్రం భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేస్తున్నారు.

పందుల దాడిలో పత్తి పంటకు నష్టం

పెంచికల్పేట్: పెంచికల్పేట్ మండలంలోని అగర్గూడ గ్రామంలో ఆదివారం పత్తి పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. గత వారం రోజులుగా రాత్రి సమయంలో పెద్ద ఎత్తున అడవి పందులు గుంపులుగా పత్తి మొక్కలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. పంటలకు పరిహారం అందించి అడవి పందుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. అటవీశాఖ అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్తున్న పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు


యూరియా పంపిణీ పరిశీలిస్తున్న హరీశ్బాబు

పెంచికల్పేట్: రైతులు యూరియా కోసం ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే హరీశ్బాబు అన్నారు. మండలంలోని చేడ్వాయి రైతు వేదికలో యూరియా పంపిణీ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. యూరియా పంపిణీ వివరాలను పరిశీలించి వ్యవసాయ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్తో పేదలకు మేలు

బెజ్జూర్: సీఎంఆర్ఎఫ్ ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. ఆదివారం కాగజ్నగర్ పట్టణంలోని ఆయన నివాసంలో మండలంలోని తలాయి గ్రామానికి చెందిన పసేం భీమయ్యకు మంజూరైన చెక్కు అందజేశారు.

ముంజంపల్లి గ్రామంలో..

ఎమ్మెల్సీ దండె విఠల్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేణుకుంట్ల పెంటన్న మండలంలోని ముంజంపల్లి గ్రామంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తోటపల్లి సంధ్యకు రూ.47వేల విలువైన చెక్కు అందజేశారు.

ఈస్గాంలో కార్డన్ సెర్చ్

కాగజ్నగర్రూరల్: కాగజ్నగర్ మండలంలోని ఈస్గాం పోలీస్స్టేషన్ పరిధిలో ఈస్గాం మార్కెట్ విలేజ్ నం.5లో ఆదివారం పోలీసులు కార్డన్సెర్చ్ నిర్వహించారు. కార్డన్ సెర్చ్లో 50 బైక్లు, 5 ఆటోలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనదారులు లైసెన్సులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. రూరల్ సీఐ కుమారస్వామి, ఈజ్గాం ఎస్సై కల్యాణ్, పోలీసులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణంలో వసతులు కల్పించాలి

బెజ్జూర్: క్రీడా ప్రాంగణంలో వసతులు కల్పించాలని ఉమ్మడి బెజ్జూర్ మండల క్రీడాకారుల సంఘం అధ్యక్షుడు కొడప పుల్లయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో క్రీడాకారుల నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా నైపుణ్యాలు కలిగి ఉన్నప్పటికీ సరైన క్రీడా వసతులు లేకపోవడంతో గుర్తింపు పొందలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి క్రీడాకారులకు సరైన వసతులు కల్పించాలని కోరారు.

పెంపుడు జంతువులకు వ్యాక్సిన్లు వేయించాలి

కాగజ్నగర్టౌన్: పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్ వేయించాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పశువుల ఆసుపత్రిలో ప్రపంచ యాంటీ రేబిస్ డే సందర్భంగా పెంపుడు జంతువులైన కుక్కలకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు రేబిస్ రాకుండా ఉండేందుకు వ్యాక్సినేషన్ టీకా వేయించాలన్నారు. శానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్, మున్సిపల్ సిబ్బంది దేవా పాల్గొన్నారు.

పత్తికి వాన గండం

- ఎడతెరిపి లేని వర్షాలతో తిప్పలు
- చేలలో నిలుస్తున్న వరద నీరు
- ఎర్రబారుతున్న పత్తి మొక్కలు
- మండలంలో 34వేల ఎకరాల్లో పత్తి సాగు


ఎదుగుదల లోపించిన పత్తి మొక్కలు

వాంకిడి: అధిక వర్షాలు పత్తి రైతులను నిండా ముంచుతున్నాయి. ప్రతీరోజు క్రమం తప్పకుండా కురుస్తున్న వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద నీరు చేలల్లో నిల్వ ఉండడంతో తేమ శాతం పెరిగి మొక్కల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఆకులు ముడత పడడం, పేను బంక, పచ్చదోమ, తెల్లదోమ వ్యాప్తి చెంది పంటకు అనేక రోగాలు సోకుతున్నాయి. క్రిమిసంహారక మందులను వాడినా ఎడతెరిపి లేని వర్షాల కారణంగా చీడ పీడలను అదుపు చేయలేకపోతున్నారు. మొక్కల్లో ఎదుగుదల లోపిస్తుండటంతో దిగుబడి సగానికి సగం పడిపోతుందని, పెట్టుబడి ఖర్చు కూడా చేతికి అందే పరిస్థితి లేదని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

విపరీతంగా కలుపు..

మండలంలో 34వేల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పత్తిలో అంతర పంటగా కంది పంట సాగు చేస్తున్నారు. దాదాపు 4800 ఎకరాల్లో కంది పంట సాగవుతుంది. మరో 1200 ఎకరాల్లో వరి, కూరగాయలు, పెసర పంటలు సాగు చేస్తున్నారు. వానాకాలం ప్రారంభం నుంచి ప్రతీరోజు వర్షాలు కురుస్తుండటంతో పత్తి పంటలో విపరీతంగా కలుపు పెరగడం, ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకం పెరిగి రైతుల ఖర్చులు పెరిగాయి. పెట్టుబడి పెరిగినా అనుకున్న స్థాయిలో దిగుబడి వస్తుందనే నమ్మకం లేకపోవడంతో రైతులు వాపోతున్నారు. ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల పత్తి దిగుబడి ఆశించిన రైతులకు ఈ ఏడాది కనీసం ఐదు క్వింటాళ్లు కూడా చేతికి అందేలా లేదు. పత్తి చెట్టు మొదల్లలో కాసిన కాయలు పగుళ్లు తేలి వర్షాలకు తేమ అధికమై బూజు పడుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన మద్దతు ధరను పెంచి రైతులను ఆదుకోవాలని, పూర్తిగా పంట నష్టపోయిన రైతులను గుర్తించి పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

మొక్కల్లో ఎదుగుదల లేదు



నేను తొమ్మిది ఎకరాల్లో పత్తి పంట వేశాను. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మొక్కల్లో ఎదుగుదల లేకుండా పోయింది. ఎరువులు, మందులు వేసినా ప్రయోజనం లేదు. వర్షాలకు పూత రాలి పోతుంది. తేమ పెరిగి ఆకులు ముడతపడుతున్నాయి. అధికారుల సూచనలు పాటించినా ఫలితం లేకుండా పోతోంది.

– అడ్డూరి దేవన్న, రైతు, ఖమాన

దిగుబడిపై ప్రభావం



వర్షాకాలం ప్రారంభం నుంచి వర్షాలు ప్రతీరోజు కురుస్తూనే ఉండటంతో పత్తి మొక్కలకు చీడ పీడలు సోకుతున్నాయి. పంట ఎదుగుదల లోపించి మొక్కలు ఎర్రబారుతున్నాయి. దీంతో దిగుబడిపై ప్రభావం పడుతుంది. పెట్టుబడిలో కనీసం సగం ఖర్చులైనా చేతికి అందుతాయో లేదోనని గుబులు పడుతున్నాం. ప్రభుత్వం దృష్టి సారించి రైతులను ఆదుకోవాలి.

– జాడి జగదీశ్, రైతు, కనర్గాం

వరద నీరు నిల్వకుండా చూడాలి

అధిక వర్షాలు కురుస్తున్నందున రైతులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. పంట చేలల్లో వరద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. కాలువలు తీసి నీటిని బయటకు పంపించాలి. ఆకులు ముడుచుకుపోవడం, ఫంగస్ వంటి లక్షణాలు కనిపిస్తే కాపర్ఆక్సిక్లోరైడ్ మందును మొక్క వేర్ల వద్ద పిచికారీ చేయాలి.

– గోపికాంత్, ఏవో, వాంకిడి

‘ఉపాధి’హామీ.. వేతనమేది!

- ఐదు నెలలుగా పెండింగ్
- మండలంలో యాక్టివ్ కూలీలు 14,455 మంది


ఆగుర్వాడలో ఎవెన్యూ ప్లాంటేషన్ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కెరమెరి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పని చేసిన కూలీలకు డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారు. కెరమెరి మండలంలోని ఆయా గ్రామాల్లో పంట పొలాలకు ఫార్మేషన్రోడ్లు, ఇంకుడు గుంతలు, మొక్కలు నాటడం, గుంతలు, మొక్కల సంరక్షణ వంటి తదితర పనులు చేస్తున్నారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో మొత్తం జాబ్ కార్డులు 10,285 ఉండగా యాక్టివ్ జాబ్ కార్డులు 8348 ఉన్నాయి. 18,785 మంది కూలీలు ఉండగా, యాక్టివ్ కూలీలు 14,455 మంది ఉన్నారు. వారిలో ఐదు నెలలు సుమారు 4532 మంది కూలీలు పని చేశారు.

రూ.10 వేల నుంచి రూ.20వేల వరకు..

ఈ ఏడాది మే నుంచి ఇప్పటి వరకు ఉపాధిహామీ కూలీలకు వేతనాలు అందకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. నెలరోజుల్లో సరాసరి ఒక కూలీకి రూ. 2వేల నుంచి రూ. 4 వేల వరకు, ఐదు నెలలకు రూ. 10వేల నుంచి రూ.20 వేలు అందాల్సి ఉంది. కానీ ఇప్పటికీ నయాపైసా అందక పోవడంతో బతుకు సాగడం ఎలాగని కూలీలు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బుల కోసం పోస్టాఫీసు, బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మే, జూన్, జూలై నెలల్లో అధికమంది కూలీలు పనులు చేశారు. డబ్బులు జమ కాకపోవడంతో కూలీలు పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదని ఎఫ్ఏలు, టీఏలు చెబుతున్నారు. గత కొంత కాలంగా కూలీ డబ్బులు ఇవ్వాలని అధికారులను వేడుకుంటున్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం కలగడం లేదని కూలీలు వాపోతున్నారు.

పండుగ పూట పస్తులేనా..

వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని, పండుగ పూట పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. పండగు నేపథ్యంలో కనీసం రూ.5 వేల వరకు ఖర్చవుతుందని, పండుగ సంబురం లేకుండా పోయిందని కూలీలు మదన పడుతున్నారు.

ఇంకా జమ కాలే..



నేను ఉపాధిహామీ పథకంలో నాలుగు వారాలు పనిచేశాను. కానీ ఇంత వరకు ఒక్క పైసా కూడా రాలేదు. రూ.4500 వరకు రావాల్సి ఉంది. ప్రతీరోజు బ్యాంకు, పోస్టాఫీసు చుట్టూ తిరుగుతున్నాను.

– సెండే శాంతాబాయి, కెరమెరి

నివేదిక పంపించాం



ఉపాధి కూలీలకు ఐదు నెలలుగా వేతనాలు అందలేదు. మొత్తం చెల్లింపుల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. నిధులు విడుదల కాగానే వారి ఖాతాల్లో జమవుతాయి.

– మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో

కోనేరు కోనప్పకు ఘన స్వాగతం


సమావేశంలో మాట్లాడుతున్న కోనేరు కోనప్ప, పక్కన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కాగజ్నగర్టౌన్: బీఆర్ఎస్ పార్టీలో చేరి హైదరాబాద్ నుంచి కాగజ్నగర్కు రైలులో వచ్చిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రైల్వేస్టేషన్లో ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. కోనప్పకు స్వాగతం పలికేందుకు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున రైల్వేస్టేషన్కు చేరుకున్నారు. కోనప్పకు శాలువాలు, పూలమాలలతో స్వాగతం పలికి నినాదాలు చేశారు. భాజాభజంత్రీల మధ్య బైక్పై ర్యాలీగా వినయ్గార్డెన్కు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో రెండు గ్రూపులు లేవని, ఉన్నది కేసీఆర్ గ్రూప్ మాత్రమేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘రిజర్వేషన్లు మార్చకుంటే ఎన్నికలు బహిష్కరిస్తాం’


మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

కెరమెరి: గిరిజన, ఆదివాసీ చట్టాలకు అనుగుణంగా రిజర్వేషన్లు మార్చకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ, ఇతర ఆదివాసీ సంఘాల నాయకులు, కుల పెద్దలు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కెరమెరి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లను మార్చడం ఆదివాసీ హక్కులు, చట్టాలను అగౌరపర్చడమేనన్నారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్, గౌరవ అధ్యక్షుడు కనకప్రభాకర్, మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, మాజీ జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, ఆదివాసీ నాయకులు ఆత్రం లక్ష్మణ్, కోవ దేవ్రావు, సిడాం జగన్నాథ్, మడావి రఘునాథ్, మడావి భరత్, చందన్షా, తుకారాం, భీంరావు, నాగోరావు, సకారాం, జాలీంశావ్, జగన్నాథ్రావు, ఆత్రం కుసుంబ్రావు, పెందోర్ ఆనంద్రావు తదితరులు ఉన్నారు.

‘రిజర్వేషన్ల కేటాయింపులో దళితులకు అన్యాయం’

వాంకిడి: మండలానికి సంబంధించి జెడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లు సక్రమంగా కేటాయించలేదని దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్లో అంబేడ్కర్ యువజన సంఘం, భారతీయ బౌద్ధ మహాసభ, సిద్ధార్థ యువజన సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వారు మాట్లాడుతూ మండలాల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి అన్ని వర్గాల వారు రాజకీయ లబ్ధి పొందారని, ఎస్సీ వర్గానికి మండల స్థాయిలో అవకాశం రాలేదన్నారు. 1972లో వాంకిడి మండలం పంచాయతీ సమితీగా ఉన్నప్పుడు తిర్యాణి, కెరమెరితో కలిసి ఉండేదని ఆ సమయంలో ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన తిరుపతి షావుకార్ అధ్యక్షుడిగా ఉన్నారని, ఆ తర్వాత వచ్చిన ఎస్సీ రిజర్వేషన్తో కెరమెరికి చెందిన మడావి రాజు సమితీ అధ్యక్షుడిగా చేశారన్నారు. ప్రత్యేక మండలాలుగా ఏర్పడ్డ తర్వాత ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలను ఎస్టీ, బీసీ, జనరల్గా మాత్రమే కేటాయిస్తూ వస్తున్నారని, దీంతో ఎస్సీ వర్గాలు రాజకీయ లబ్ధి పొందలేకపోతున్నారని ఆరోపించారు. ఈసారైనా ఎస్సీ వర్గానికి వస్తుందనే ఆశతో ఉన్నప్పటికీ నిరాశే ఎదురైందని పేర్కొన్నారు. మండల, జిల్లా స్థాయి అధికారులకు మండలంపై సరైన అవగాహన లేకపోవడమే దీనికి కారణమన్నారు. కేటాయించిన రిజర్వేషన్లపై పునఃసమీక్ష చేయాలని లేకుంటే కోర్టును ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, మండల అధ్యక్షుడు దుర్గం దుర్గాజీ, ప్రధాన కార్యదర్శి విజయ్ ఉప్రే, గౌరవ అధ్యక్షుడు జైరాం ఉప్రె తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలి


మాట్లాడుతున్న జీఎం విజయ భాస్కర్ రెడ్డి

రెబ్బెన: యువత తమకు నచ్చిన క్రీడలో రాణించేందుకు పాటుపడాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి, రెబ్బెన ఎస్సై వెంకటకృష్ణలు అన్నారు. ఆదివారం మండలంలోని గోలేటి టౌన్షిప్లో గల సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో అర్జున్ చారిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువకులు క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏరియాలో మండల స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు.

పోటీల విజేత తంగళ్లపల్లి..

గోలేటిలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా తంగళ్లపల్లి జట్టు నిలిచింది. ఫైనల్ మ్యాచ్లో తంగళ్లపల్లి, గోలేటి జట్లు తలపడ్డాయి. పోటీల్లో విజేతగా నిలిచిన తంగళ్లపల్లి జట్టుకు రూ.3100, రెండో స్థానంలో నిలిచిన గోలేటి జట్టుకు రూ. 2వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమాల్లో ట్రస్ట్ చైర్మన్ కోట సుధాకర్, సభ్యులు గోపాలకృష్ణ, నిర్వాహకులు అజ్మీర అర్జున్, క్రీడాకారులు హరిలాల్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ


ఆసిఫాబాద్అర్బన్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు


దహెగాం: బతుకమ్మతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలోని హనుమాన్ మందిర్ వద్ద ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మలతో పెద్దవాగు తీరానికి వచ్చి బతుకమ్మ ఆడారు. బతుకమ్మల సందడితో పెద్దవాగు మురిసింది. సాయంత్రం 6 గంటలకు హనుమాన్ మందిర్ వద్దకు మహిళలు ఏకరూప దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో చేరుకున్నారు. అర్ధరాత్రి బ్యాండు మేళాలతో పలు వాడల మీదుగా శోభాయాత్ర నిర్వహించి స్థానిక పెద్దవాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

దహెగాం: మండల కేంద్రంలో ఆదివారం ప్రెస్క్లబ్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్లు హాజరయ్యారు. ముందుగా బతుకమ్మని ప్రెస్క్లబ్ కార్యాలయం నుంచి అంగడిబజార్ వరకు మహిళతో కలిసి తీసుకొచ్చారు. అనంతరం బతుకమ్మ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి బతుకమ్మ ఆట ప్రారంభించారు. సహకార సంఘం చైర్మన్ కోండ్ర తిరుపతిగౌడ్, వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు నిర్మల, వైద్యాధికారిని అశ్విని, మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు పాల్గొన్నారు.

‘సింగరేణిలో దసరా సెలవు తేదీ మార్చాలి’

రెబ్బెన: సింగరేణిలో కార్మికులకు దసరా సెలవు తేదీని మార్చాలని హెచ్ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు డిమాండ్ చేశారు. ఆదివారం గోలేటి టౌన్షిప్లోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మహాత్మాగాంధీ జయంతి, దసరా పండుగ ఒకేరోజు రావడంతో సింగరేణి కార్మికులు విలువైన ఒక పీహెచ్డీ కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే కోల్ ఇండియాలో దసరా తేదీని మార్చినప్పటికీ సింగరేణిలో మాత్రం మార్చలేదన్నారు. సమావేశంలో సెంట్రల్ వైస్ప్రెసిడెంట్ ఓజియార్, బ్రాంచి కార్యదర్శి ఎం.శివారెడ్డి, కిష్టస్వామి, ఏరియా ఆర్గనైజర్ ఎస్కే ఇనూస్, ఉమామహేశ్వర్, కిష్టస్వామి తదితరులు పాల్గొన్నారు.

‘30న సద్దుల బతుకమ్మ నిర్వహించాలి’

కాగజ్నగర్టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 30వ తేదీన సద్దుల బతుకమ్మ నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తుమ్మ రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 30న బతుకమ్మ పండుగ నిర్వహిస్తుంటే కాగజ్నగర్లో కొందరు సోమవారం నిర్వహించాలని, మంగళవారం మంచిది కాదనడం సరికాదన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ విఠల్

బెజ్జూర్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. ఆదివారం కాగజ్నగర్ పట్టణంలోని ఎమ్మెల్సీ నివాసంలో బెజ్జూర్ మండల సోమిని గ్రామానికి చెందిన జాడి లక్ష్మణ్ నాయకులతో కలిసి ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్సీ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ సిడం గణపతి, తాజా మాజీ జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, పాక్స్ మాజీ చైర్మన్ కుర్సిగ ఓంప్రకాశ్, నాయకులు నహీర్ అలీ, సురేశ్ గౌడ్, జలపతి, బీమయ్య పాల్గొన్నారు.

భగత్సింగ్ను ఆదర్శంగా తీసుకోవాలి


ఆసిఫాబాద్రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: భగత్సింగ్ను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకొని సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగించాలని బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ అన్నారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్లో ఆదివారం భగత్సింగ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్రూరల్: స్వాతంత్ర్య పోరాటంలో భగత్సింగ్ పోరాటం ఎంతో గొప్పదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో భగత్సింగ్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెంటన్న, ప్రసాద్, శంకర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు

కాగజ్నగర్టౌన్: కాగజ్నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్రీడామైదానంలో సోమవారం హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మకు ఆదివారం ఏర్పాట్లు పూర్తి చేశారు. క్రీడామైదానం చుట్టూ విద్యుత్ దీపాలు, స్టేజీ ఏర్పాటు చేశారు. బతుకమ్మ ఆడేందుకు వచ్చే మహిళలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. వర్షం పడితే బురద కాకుండా కంకర వేసి చదును చేశారు.

‘హిందువునని గర్వంగా జీవించాలి’


మాట్లాడుతున్న ప్రచారక్ నాగరాజు

కౌటాల: ప్రతీ హిందువు హిందువునని గర్వంగా జీవించాలని ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రచారక్ నాగరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా విజయదశమి వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హిందువులు హిందు ధర్మంలో ఉన్న ధర్మ, అర్థ, కామ, మోక్షం అనే చతుర్విధ పురుషార్థాలు ఆచరించాలని తెలిపారు. హిందూ సమాజంలో మార్పు కోసం పంచ పరివర్తనే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ పని చేస్తుందని తెలిపారు. ఆర్ఎస్ఎస్ సభ్యులు దుర్గం జుంగాజీ, ప్రభీర్ కుమార్ మండల్, చిప్ప మల్లయ్య, ఉప్పుల వెంకటేశ్, దాసరి వినోద్ గౌడ్, ఎల్ములే దత్తు, సాయి, వంశీ, స్వయం సేవకులు పాల్గొన్నారు.